

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 184 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 04, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# భూ కబ్జాదారుల భరతం పట్టండి !




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## సామాన్యుల భూముల్ని బలవంతపు కబ్జాలు చేస్తున్నారు

- కేయూ భూముల కబ్జాదారులపై చర్యలు శూన్యం
- కబ్జాదారుల ఆస్తులను బట్టి పీడీ ఆక్ట్స్ పెట్టాలి
- భూ కబ్జాలలో రాజకీయ నాయకులు పోలీస్ లు వ్యాపారులు జర్నలిస్టులు ఎవరి వున్నా వదిలిపెట్టొద్దు
- సామాన్య ప్రజల ఉసురు పోసుకుంటున్న కరుడుగట్టిన భూకబ్జాదారులు
- కేయూ భూములను కబ్జాలు చేసిన భూకబ్జాదారులు దర్జాగా తిరుగుతున్నారు
- పోలీస్ అధికారులు భూములు కబ్జాలు చేస్తే చర్యలు ఉండవా
- పోలీస్ అధికారులు భూ సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు కలవు
- భూ కబ్జాలకు కేంద్ర బిందువుగా నిలిచిన మున్సిపల్ శాఖ
- రెవెన్యూ అధికారుల మోసాలు ప్రజలను తీవ్రమైన భయాందోళనకు గురిచేస్తున్నాయి : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భూకబ్జాల పరంపర విపరీతంగా పెరిగిపోతుందని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. పేదవాళ్ల భూములను కబ్జాలు చేయడానికి భూకబ్జాదారులు రాజకీయ నాయకుల పరపతిని,సహకారాన్ని తీసుకుంటున్నారని తీవ్రమైన విమర్శలు వస్తుండగా భూకబ్జాదారుల భరతం పట్టాల్సిన ప్రభుత్వ అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి భూకబ్జాదారుల వైపు సహకరిస్తుండడం సర్వసాధారణమైపోయిందని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చెందుతున్నారన్నారు. న్యాయస్థానాల పరిధిలో, కోర్టు కేసులలో ఇమిడివున్న భూతగాదా కేసులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ శాఖ అధికారులు వేలకుపైగా అనుమతులు మంజూరు చేస్తూ ఒరిజినల్ పట్టాదారుల భూములను భూకబ్జాదారులకు కట్టబెట్టే ప్రయత్నంలో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసి చేతులు దులుపుకొని విపరీతమైన భూ తగాదాలకు సంబంధించిన గొడవలను రెచ్చగొడుతున్నారని హెచ్చరించారు.ప్రధాన భూములలో కొనసాగుతున్న అక్రమ భవన నిర్మాణాల అనుమతులు కరుడుగట్టిన భూకబ్జాలకు నిలయంగా మారుతున్నాయని ప్రజలు నెత్తినోరు బాదుకుంటున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.భూముల

- మిగతా 2లో..

## తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్

- ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!
- తెలంగాణ ఎన్నారైలు ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ జతచేయాలి
- తెలంగాణలో జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ
- మొబైల్ నంబర్ లింక్ లేకుంటే ఆన్‌లైన్ నమోదుకు అనర్హులు
- ఈసీఐ పోర్టల్‌లో ఫారం 8 ద్వారా వివరాలు మార్చుకునే అవకాశం
- ఓటర్ ఐడీ, ఆధార్ కార్డులో పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి

2




## ఏపీకి ఐదు రోజుల పాటు వర్ష సూచన

- 24 గంటల్లో కేరళలోకి ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు
- మధ్యప్రదేశ్ నుంచి రాయలసీమ వరకు కొనసాగుతున్న ద్రోణి
- వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



2

## తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది...

7

కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది: పవన్

## పవన్ మాటలు అర్థం లేనివి..

- తెలివి తక్కువగా మాట్లాడటం మంచిది కాదు: బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి
- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి
- తెలంగాణలో కాంగ్రెస్, జనసేన మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందని ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ డ్రామా అని వ్యాఖ్య

4





## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

- తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు
- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

**తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు**
**ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం**
**పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ**

**తెలంగాణ, జై భీమ్ న్యూస్**

తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

# తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్

**ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!**
**తెలంగాణ ఎన్నారైలు ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ జతచేయాలి**
**తెలంగాణలో జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ**
**మొబైల్ నంబర్ లింక్ లేకుంటే ఆన్‌లైన్ నమోదుకు అనర్హులు**
**ఈసీఐ పోర్టల్‌లో ఫారం 8 ద్వారా వివరాలు మార్చుకునే అవకాశం**
**ఓటర్ ఐడీ, ఆధార్ కార్డులో పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ సహా తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) తమ ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. మొబైల్ నంబర్ లింక్ లేకపోతే, ఎన్నారైలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమర్పించడం సాధ్యం కాదని, ఓటర్ల జాబితాలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు తెలిపారు. ఎన్నారైలు తమ మొబైల్ నంబర్‌ను లింక్ చేయడానికి ఈసీఐ అధికారిక పోర్టల్ జశోవతీం.వఎఱ.స్త్రశీజ.అఅను సందర్శించాలి. అక్కడ ఫారం 8 (ప్రస్తుత ఓటర్ల జాబితాలో వివరాల సవరణ)ను పూర్తి చేయాలి. మొబైల్ నంబర్ నమోదు చేశాక వచ్చే ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి అని, ఫారం సమర్పించేటప్పుడు ఆధార్ అథెంటికేషన్ అవసరమని అధికారులు నొక్కిచెప్పారు. తెలంగాణలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీని ప్రకారం, జూన్ 15 నుంచి 24 వరకు ఓటర్ల జాబితా రూపకల్పన, జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు స్వీకరించి, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, తమ ఓటు హక్కును కాపాడుకోవాలనుకునే ప్రవాస భారతీయులకు ఈ ప్రక్రియ చాలా కీలకం. నిర్ణీత గడువులోగా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా వారు తమ రాష్ట్రంలోని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా కొనసాగవచ్చు.

# ఏపీకి ఐదు రోజుల పాటు వర్ష సూచన

**24 గంటల్లో కేరళలోకి ప్రవేశించనున్న నైరుతి రుతుపవనాలు**
**మధ్యప్రదేశ్ నుంచి రాయలసీమ వరకు కొనసాగుతున్న ద్రోణి**
**వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



దేశవ్యాప్తంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాబోయే 24 గంటల్లో ఈ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించనున్నట్లు అధికారులు వెల్లడించారు. తద్వారా ఇవి క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నాయి. గురువారం నాటికి నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్ర ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల విస్తరణతో ఎండల తీవ్రత తగ్గి, ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయి.

# భూ "కబ్జాదారుల" భరతం పట్టండి

మొదటి పేజీ తరువాయి

కబ్జాలలో పేరు మోసిన భూకబ్జాదారులందరూ రాజకీయ అండదండలు చూసుకొని విర్రవీగుతున్నారని వాళ్ళందరినీ అరికట్టే ప్రభుత్వ యంత్రాంగాలు వాళ్లకు సహకరిస్తున్నందున పెద్ద ఎత్తున భూకబ్జాలు పెరిగిపోతున్నాయని గమనించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ భూకబ్జాదారుల భరతం పట్టాలని నిర్ణయించుకున్న తీరు సాధారణ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ఉందన్నారు.

**భూ కబ్జాలలో రాటు తేలుతున్న కేటుగాళ్ళు..**

వరంగల్ జిల్లాను భూకబ్జాలమయం చేయడంలో భూకబ్జాదారుల పాత్ర ఎంతైతే ఉందో వాళ్లకు సహకరిస్తున్న అధికారులు రాజకీయ నాయకుల పాత్ర కూడా అంతే స్థాయిలో ఉంటుందనేది ప్రజలు బలంగా నమ్ముతుండగా సాధారణ భూకబ్జాలు మొదలుకొని కోట్లకు పరుగెత్తే భూములను కబ్జాలు పెట్టే స్థాయికి భూకబ్జాదారుల పతారా నడుస్తుందంటే దాని వెనకాల భూకబ్జాదారులు ఎరవేసే డబ్బులకు అన్ని శాఖల ప్రభుత్వాధికారులు పెద్ద ఎత్తున ఆశపడుతున్నారని డబ్బులు సంపాదించే సునాయాసమైన మార్గాలను ఎంచుకుంటున్న ప్రభుత్వ అధికారులు భూ కబ్జాదారులు కట్టబెట్టే డబ్బుల కోసం సెటిల్మెంట్ల రూపంలో కొత్త రకమైన భూధందాను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.సాధారణ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ గోగ్గోలు పెడుతూ మొత్తుకుంటున్నా వాళ్లకు న్యాయం జరగలేని పరిస్థితులు లెక్కలేనని కలవని వాటన్నిటిని గమనిస్తున్న పోలీస్ బాస్ పేద ప్రజల తరఫున నిలబడుతూ తన నోటీసు వచ్చిన ప్రతి భూకబ్జాపై ఖచ్చితమైన చర్యలు చేపడుతూ పోలీస్ అధికారులే కాకుండా ఇతర శాఖల అధికారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు.భూ కబ్జాలలో కేటుగాళ్లుగా మారిపోయిన అసలైన భూకబ్జాదారుల సమాచారాలను ప్రతి పోలీస్ స్టేషన్ లోని అధికారులు గోప్యంగా ఉంచుతూ దాస్తున్నారని పోలీస్ బాస్ దృష్టికి రావడంతో అలాంటి స్టేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వాసనీయ సమాచారం అన్నారు.భూకబ్జాల ద్వారా ఆస్తులు సంపాదించుకుంటున్న భూ కబ్జాదారుల లిస్టులను స్టేషన్ల వారీగా సమీకరించాలని పోలీస్ బాస్ హెచ్చరించడం ప్రజలకు లోతైన విధంగా సహాయపడే మార్గాన్ని ఎంచుకున్నారని ప్రశంసించారు.రోజువారీగా ప్రతి పోలీస్ స్టేషన్లో జరుగుతున్న భూతగాదాలు భూ సెటిల్మెంట్ల వివరాలు పోలీస్ బాస్ దృష్టికి రావడంతో ఎలాగైనా వాటన్నిటిని నియంత్రించాలని తనే రంగంలోనికి దిగి ప్రతి పోలీస్ స్టేషన్ సందర్శిస్తూ విచారణ చేపడుతుండడం స్టేషన్ అధికారులు భయాందోళనలు చెందడమే కాకుండా భూ బాధితులకు తగిన విధంగా న్యాయం చేసే పనిలో నిమగ్నం అవుతున్నారని గుర్తు చేశారు.కేవలం భూకబ్జాదారులను ప్రోత్సహించే రాజకీయ నాయకులకు కూడా పరోక్షమైన హెచ్చరికలు జారీ చేసే విధంగా నేరుగా పోలీస్ బాస్ స్టేషన్ల సందర్శించి స్టేషన్ అధికారులకు తగిన సూచనలు డైరెక్షన్స్ చేస్తుండడం ఎలాంటి ప్రలోభాలకు ఎలాంటి ఒత్తిళ్లకు ఎలాంటి రాజకీయ ప్రోత్బలానికి లొంగకుండా పోలీసులు బాధ్యతాయుతంగా ప్రజల వైపు నిలబడాలనే గొప్ప నినాదాన్ని ప్రకటించే విధంగా పోలీస్ బాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

**అంతట అదే తీరు..... షరామామూలే..**



భూకబ్జాలలో ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ అధికారులు ఉంటుండడం బాధాకరమైన విషయన్నారు.రెవెన్యూ అధికారులు అక్రమంగా నాలా కన్వర్షన్ల పేర్ల మీద ప్రభుత్వ భూములను సైతం కబ్జాలు చేస్తున్న వ్యక్తులకు అనుమతులు మంజూరు చేస్తుండగా,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు కబ్జా చేయబడుతున్న ప్రతి భూమికి డబ్బులు దండుకొని దర్జాగా అనుమతులు ఇస్తూ భూకబ్జాల కోసమే ఉద్యోగాలు చేస్తున్నట్లుగా వాళ్ల ప్రవర్తనను బయట పెట్టుకుంటున్నారని ప్రజలు పడుతున్న బాధలను బట్టి అలాంటి అధికారులను హెచ్చరించారు.ఇతర శాఖల అధికారులు భూకబ్జాదారులకు సహకరించడం కోసం తీవ్రమైన సహకారం అందించడంలో ప్లాట్ల రూపంలో విల్లాల రూపంలో డబ్బులు రూపంలో పెద్ద ఎత్తున లాభాలు పొందుతున్నారని అలాంటి వాళ్ళ జాతకాలను ప్రజలు గమనిస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.పోలీస్ అధికారులదైతే బాధ్యతను మరిచిపోయి భూకబ్జా దందాలకు పూర్తిగా సహకరిస్తున్నారని వరంగల్ జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన విమర్శలను ప్రజలు లేవనెత్తుతున్నారని అలాంటి వాటిని పట్టించుకోకుండా పోలీసు పోస్టింగుల కొరకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ సామాన్య ప్రజలకు సేవ చేయాల్సిన పోలీసు అధికారులు వాళ్లకి చేయాల్సిన సేవలను విస్మరిస్తూ ఎక్కువ శాతం ప్రతి పోలీస్ స్టేషన్లో భూకబ్జాదారుల హవానే కొనసాగించబడే విధంగా సామాన్యులపై సాధారణ భూపాధితులపై తీవ్రమైన ఒత్తిల్లతో కూడిన మానసిక శారీరక ఆర్థిక దాడులు పెంపొందించబడే విధంగా కొంతమంది పోలీస్ అధికారులు ప్రవర్తిస్తుండడం పోలీస్ శాఖకు తీవ్రమైన అపనిందలు వచ్చే ఆస్కారం ఉందన్నారు.భూకబ్జాదారులతో దోస్తానీ చేస్తూ సన్నిహితంగా ఉంటున్న పోలీసు అధికారులపై నిఘా విభాగం నగర్ వేయాలని కోరినారు.భూ కబ్జాల విషయంలో కేసులను తార్నారు చేస్తూ కబ్జాదారులకు సహకరిస్తున్న కొంతమంది పోలీసు అధికారులు ఈ మధ్యకాలంలో సస్పెండ్ కావడం కూడా పోలీస్ వర్గాల్లో కలకలం రేపినప్పటికిని కొంతమంది పోలీసు అధికారులు ఏమాత్రం భయం లేకుండా భూముల పైకి వెళ్లి మౌలిక విచారణ చేపడుతూ భూకబ్జాదారులకు సహకరిస్తున్న తీరు పచ్చి మోసమన్నారు.కొంతమంది జర్నలిస్టులు భూకబ్జాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సింది పోయి తెల్లారింది మొదలుకొని భూకబ్జాదారులతో సన్నిహితమైన సంబంధాలు పెట్టుకుంటూ భూ వ్యాపారాలకు పాల్పడుతుండడం కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించుకోవడం గమనిస్తుండగా జర్నలిస్టుల బాధ్యతను మరిచిపోయి భూకబ్జాల వైపు అడుగులు వేయడం ఎంతో సిగ్గుకరమన్నారు.నిజాయితీగా ప్రస్తావించాల్సి వస్తే భూకబ్జాలు జరుగుతున్న తీరుపట్ల జర్నలిస్టులు ఎంతో అప్రమత్తంగా ఉంటూ నిజాయితీగా భూములు కోల్పోతున్న బాధితుల వైపు సహకరించేది పోయి కరుడుగట్టిన భూకబ్జాదారులకు వెన్నుదండుగా నిలుస్తూ వార్తలు రాస్తూ వాళ్లకు సహకరిస్తుండడం సిగ్గుకరమన్నారు.

**కలెక్టర్ల పవర్ ఖతర్నాక్..**

భూకబ్జాలను నియంత్రించడంలో వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ కలెక్టర్లు ఇప్పటికే తగు జాగ్రత్తలు చేపడుతున్నారని గుర్తు చేశారు.వరంగల్ జిల్లా కలెక్టర్ హనుమకొండ జిల్లా కలెక్టర్లు భూకబ్జాలను ప్రోత్సహిస్తున్న రెవెన్యూ అధికారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామంటూ అందులో భాగంగానే రెవెన్యూ అధికారులను హెచ్చరించడం రెవెన్యూ శాఖపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా చేసిందన్నారు.చాలా రెవెన్యూ కార్యాలయాల్లో మండల స్థాయి రెవెన్యూ అధికారులు భూకబ్జాలకు సహకరిస్తుండగా వాళ్ళు సిద్ధపరచిన నివేదికల ఆధారంగా పై అధికారులు కూడా భూకబ్జాల వైపు సహకరిస్తూ ఉండడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు.రికార్డుల మార్పులు అయితేనేమి విచారణ నివేదికల మార్పులైతేనేమి కేవలం కబ్జాదారులకు అనుగుణంగా మాత్రమే కొనసాగిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.కొన్ని రెవెన్యూ కార్యాలయాలను పూర్తిగా భూకబ్జాలకు ఆశ్రయాలుగా మార్చి పారేసారని హెచ్చరించారు.ప్రభుత్వ భూములన్నీ మాయమైతున్నదే రెవెన్యూ అధికారుల చౌరవతనని తెలియజేశారు.చెరువులు మొదలుకొని నాళలు మొదలుకొని ప్రభుత్వ ఆబాది,గ్రామకంట్లం భూములు మొదలుకొని దేవాలయాల భూములు పార్కుల భూములు ఆశ్రమాల భూములు పాఠశాలల భూములు అన్నిటికి మించి కాకతీయ విశ్వవిద్యాలయ భూములు కబ్జాలు జరగడానికి ప్రధాన కారకులే రెవెన్యూ అధికారులని హెచ్చరించారు.రికార్డుల మార్పిడి చేయడం పహాని రికార్డులను టాంపర్ చేయడం భూకబ్జాదారుల పేర్లను పట్టాదారులుగా మార్చడంలో రెవెన్యూ అధికారుల పాత్ర గణనీయంగా ఉందన్నారు.ప్రభుత్వ భూములను చెరువులను కాకతీయ విశ్వవిద్యాలయ భూములను కబ్జాలు చేసిన భూకబ్జాదారుల భరతం పట్టడానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసిందని త్వరలో భూకబ్జాదారుల బరతం పట్టడానికి కొత్త రకమైన మార్గదర్శకాలతో కూడిన చర్యలు చేపట్టబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం అన్నారు.ఏది ఏమైనా భూకబ్జాదారుల భరతం పట్టడానికి ప్రతి ప్రభుత్వ అధికారి బాధితుల నుండి వస్తున్న వినతులను స్వీకరిస్తూ బాధితులు బాధితులు చేస్తున్న ఫోన్లకు సమాధానమిస్తూ తగిన విధంగా చర్యలు చేపట్టాలని కోరినారు.

# తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు.. జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

**భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ**
**పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు**
**శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్లు తెలిపిన మంత్రి పొంగులేటి**
**వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్లు వెల్లడి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు. కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు. ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## పుచ్చకాయలోని తెల్లని భాగం పొరబాటున ఎప్పుడైనా తినేశారా?

చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. వేసవిలో ప్రకృతి ప్రసాదించిన అద్భుత వరం పుచ్చకాయ. పండ్ల రారాజు మామిడి, లిచీ, పుచ్చకాయ వంటి అన్ని రకాల పండ్లు ఈ కాలంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు మించిన ప్రత్యామ్నాయం మరొకటి లేదు. అయితే మనలో చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. ఇందులో సిట్రులైన్ అనే ఒక రకమైన అనావశ్యక అమైనో ఆమ్లం ఉంటుంది. పుచ్చకాయలోని తెల్లని భాగం తినడం వల్ల శరీరంలో దీని స్థాయి పెరుగుతుంది. సిట్రులిన్ మన రక్త నాళాలను విస్తరిస్తుంది. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం సిట్రులైన్ కండరాలకు ఆక్సిజన్ అందిస్తుంది. ఫలితంగా పనితీరు పెరుగుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ హైపర్‌టెన్షన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. పుచ్చకాయలోని తెలుపు, ఇతర భాగాలు పెద్దలలో అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయనే సంగతి తెలిసిన విషయమే. ఫైబర్ ప్రేగు కదలికలకు సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు త్వరగా కడుపు నింపుతాయి. ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.

# సేవా లక్ష్యాల్లో చేయూతనివ్వాలి





**మానసిక దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ**
**మానసిక వికలాంగుల సేవలో మానవత్వం దాగుంది.**
**మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం - రక్త పరీక్షలు నిర్వహణ,**
**డాక్టర్ అనితా రెడ్డిచే ఉచిత మందుల పంపిణీ**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

మతిస్థిమితం కోల్పోయిన మానసిక వికలాంగులకు వైద్య సేవలు చేయడం జన్మతాధన్యమని డాక్టర్ అనిత రెడ్డి తెలిపారు.మానసిక దివ్యాంగులలో కనీస వైద్యం చేయించుకోలేని సంఖ్య లెక్కకు మించి ఉన్నారని అలాంటి వాళ్లను గుర్తిస్తూ కనుగొని దగ్గరుండి వైద్య సేవలు చేయించడం అద్భుతంగా భావించాలన్నారు. అందులో భాగంగానే బుధవారం రోజు హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం రక్త పరీక్షల నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సి) వైద్య సిబ్బంది పాల్గొని సుమారు 70 మంది మానసిక దివ్యాంగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందజేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రక్తపోటు, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనురాగ్ సొసైటీ వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థల నేషనల్ వైస్ చైర్మన్, ఎడ్వైజర్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అన్నారు, ప్రత్యేక అవసరాలున్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చేయించుకోవాలని సూచించారు. శాయంపేట పీహెచ్ సి వైద్య బృందం అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు కోడం కళ్యాణ్ కుమార్, వసంత మరియు శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సి) సిబ్బంది బి. మల్లేశం (హెచ్ ఎస్-ఎం), ఎస్. కృష్ణకళ (హెచ్ ఏ ఈ ), కె. శివకుమార్ (హెచ్ ఏ-ఎం), ఎం. రాజేష్ (ఎల్ టి), బి. శ్రీలత (ఆశా), కె. రాజశ్రీ (ఆశా) పాల్గొన్నారు. డాక్టర్ అనితా రెడ్డి అనురాగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.

# ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి పనులపై సమీక్ష





**వరంగల్, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు (రిటైర్డ్ ఐపీఎస్), ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఏనుగాల వెంకట్రామ్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్, కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి (కమిటీ కన్వీనర్), ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, అడ్మిన్ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవల నాణ్యత, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది అవసరాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో చర్చించారు. అలాగే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవల నాణ్యతను పెంచేందుకు అధికారులు, కమిటీ సభ్యులు సూచనలు చేశారు. ఎంజీఎం ఆసుపత్రిని రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రభుత్వ వైద్యసంస్థగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# పాఠశాల ప్రహరీ పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

**హసన్‌పర్తి-జయగిరి రహదారిపై నిర్లక్ష్యానికి నిదర్శనం.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**

**హసన్‌పర్తి, 3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల కేంద్రం నుంచి జయగిరికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థులు, స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేకపోవడం, విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండటం, విద్యుత్ పరికరాలు బహిరంగంగా కనిపించడం ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఈ పరిస్థితి ఉండటంతో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు తెలియక ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు చేరుకునే అవకాశం ఉండటంతో విద్యుత్ షాక్‌లు లేదా ఇతర ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల పరిసర ప్రాంతం చెత్తాచెదారం, కార్డుబోర్డు పెట్టెలు, పొడి ఆకులు, పొదలతో నిండిపోయి ఉండటం మరో ప్రమాదానికి దారితీసే అవకాశముంది. విద్యుత్ స్పార్కింగ్ జరిగితే అగ్నిప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ లీకేజీలు, షార్ట్‌సర్క్యూట్ ఘటనలు జరిగే అవకాశం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజల కథనం ప్రకారం ఈ సమస్య చాలా కాలంగా ఉన్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలుమార్లు కోరినా స్పందన లేదని వారు వాపోతున్నారు. ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ తక్షణమే భద్రతా కంచె ఏర్పాటు చేయడం, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడం, పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగాక చర్యలు తీసుకోవడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం ముంచుకొచ్చే వరకు అధికారులు వేచి చూడకుండా వెంటనే స్పందించి భద్రతా చర్యలు చేపట్టాలి అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఎన్‌హెచ్-163జీ భూసేకరణపై రైతులతో ఆర్బిట్రేషన్

**రైతుల అభ్యంతరాలు, పరిహారం అంశాలపై కలెక్టర్ సమీక్ష**

**వరంగల్, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

జాతీయ రహదారి-163జీ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామానికి చెందిన భూ నిర్వాసిత రైతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆర్బిట్రేషన్ నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురైన సమస్యలు, పరిహారం చెల్లింపులు, భూముల విలువ నిర్ణయం తదితర అంశాలపై రైతుల అభ్యంతరాలను కలెక్టర్ నేరుగా విన్నారు. రైతులు తమ భూముల స్వాధీనం, పరిహారం చెల్లింపులకు సంబంధించిన పలు సమస్యలు, డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ప్రభుత్వ నిబంధనలు మరియు చట్టపరమైన మార్గదర్శకాల మేరకు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో భూసేకరణకు సంబంధించిన వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడం లక్ష్యంగా ఈ ఆర్బిట్రేషన్ సమావేశాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, ఆర్డీవో సుమ, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు, ప్రభావిత రైతులు పాల్గొన్నారు.




## పాలకుర్తి మార్కెట్ యార్డులో రైతుల ఆవేదన.. కలెక్టర్‌కు ఫోన్ చేసిన ఎర్రబెల్లి







**పాలకుర్తి, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను తెలుసుకునేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ మార్కెట్ యార్డును సందర్శించారు. పాలకుర్తి నియోజకవర్గ పరిసర గ్రామాల రైతులు తమ ధాన్యం కొనుగోలులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మార్కెట్ యార్డుకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వారం రోజులుగా ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నప్పటికీ సంచుల కొరత, లారీల లభ్యత లేకపోవడం వల్ల ధాన్యం యార్డుల్లోనే నిల్వ ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా ఇప్పటికే ధాన్యం తడిసి నష్టపోతుండగా, కొనుగోలు ప్రక్రియలో జాప్యం మరింత నష్టానికి దారితీస్తోందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను విన్న ఎర్రబెల్లి దయాకర్ రావు జనగామ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం రోడ్లపై, మార్కెట్ యార్డుల్లోనే ఉండిపోవడం బాధాకరమని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు సకాలంలో రైతుబంధు అందడం లేదని, విత్తనాలు, ఎరువుల సరఫరాలో కూడా సమస్యలు ఉన్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్‌లో ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఆ హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. గత యాసంగి బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, మార్కెట్ యార్డులను కాంగ్రెస్ మంత్రులు స్వయంగా సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు

**మడికొండలో జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన**

**హన్మకొండ, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



మహిళల ఆర్థిక సాధికారతను మరింత బలోపేతం చేసే దిశగాఎ హనుమకొండ జిల్లా మడికొండ మహిళా ప్రాంగణంలో డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు బుధవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన సమాజాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా వివిధ రంగాల్లో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మహిళలు, పెట్రోల్ బంక్ నిర్వహణలోనూ ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగానే కాకుండా యజమానులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆదాయ వనరుల విస్తరణకు ఈ పెట్రోల్ బంక్ దోహదపడుతుందని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధిలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఐనవోలు ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించి మహిళా సభ్యులకు ఆర్థిక సహాయ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంయుక్తంగా అందజేశారు. మహిళలు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మరింత ముందుకు సాగి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీనివాస్, బీపీసీఎల్ ప్రతినిధులు, ఐకేపీ రీజినల్ కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐకేపీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఎల్లాపూర్ స్లీపర్ కంపెనీలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం

**ఇన్స్పెక్టర్ ఆకునూరి మహేందర్ కీలక సూచనలు**

**హాసన్‌పర్తి, 3 జూన్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నేపథ్యంలో ఉద్యోగుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఎల్లాపూర్ స్లీపర్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులకు సైబర్ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. కంపెనీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో ప్రతి వ్యక్తి స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలను విస్తృతంగా వినియోగిస్తున్నందున సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగులు కార్యాలయానికి సంబంధించిన డేటా భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బలమైన పాస్‌వర్డ్‌ల సృష్టి, వాటి నిర్వహణ, ద్వి-దశ ధృవీకరణ (టు-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్) ప్రాముఖ్యత, ఫిషింగ్ ఈ-మెయిల్స్, నకిలీ వెబ్‌సైట్లను గుర్తించే విధానాలు, సోషల్ ఇంజినీరింగ్ దాడులు, ర్యాన్సమ్‌వేర్ వంటి సైబర్ ముప్పులపై సవివరంగా వివరించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించడం, అధికారిక సాఫ్ట్‌వేర్‌లను మాత్రమే వినియోగించడం వంటి అంశాలపై ప్రాక్టికల్ సూచనలు అందించారు. అలాగే సంస్థకు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని సురక్షితంగా నిర్వహించడం, కార్యాలయ కంప్యూటర్లు, డిజిటల్ పరికరాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా సంస్థలకు ఆర్థిక నష్టం, డేటా లీకేజీలు, సైబర్ దాడులు వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, సైబర్ భద్రత అనేది కేవలం ఐటీ విభాగం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి తన బాధ్యతగా భావించి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా సంస్థ డేటాను రక్షించడంతో పాటు సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఉద్యోగుల్లో భద్రతా చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో ఉద్యోగులు సైబర్ భద్రతకు సంబంధించిన పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకోగా, భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సైబర్ ముప్పుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, భద్రతా నియమాలను పాటించడం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థాగతంగా సురక్షిత వాతావరణాన్ని నెలకొల్పవచ్చని ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ సూచించారు.




## వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా వెంకటరమణ



**వరంగల్, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డీఎస్పీగా నియమితులైన ఎం. వెంకటరమణ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటరమణకు సూచించారు. కాగా, గతంలో వరంగల్ సైబర్ క్రైమ్ డీఎస్పీగా విధులు నిర్వహించిన కె. గిరికుమార్ మహబూబ్‌నగర్ సైబర్ క్రైమ్ డీఎస్పీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎం. వెంకటరమణ నియమితులయ్యారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి: మాదిగ యూత్ ఫోర్స్



**హైద్రాబాద్, 3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మాదిగ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మాదిగ యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పడిదల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకు మించి వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. తమిళనాడు రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, తెలంగాణలో కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఫీజుల నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పి. శ్రీనాథ్, కె. వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, మచ్చ రమేష్, పి. దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా అందించాలి - డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య

**హన్మకొండ, 3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




జిల్లాలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. బుధవారం ఆయన ఆకస్మికంగా రాయపుర అంగన్‌వాడీ కేంద్రం--4తో పాటు పెద్దమ్మగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాల నిర్వహణ, వ్యాక్సిన్ నిల్వ విధానం, లబ్ధిదారుల హాజరు, కోల్డ్ చైన్ వ్యవస్థ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్యూ లిస్ట్ ప్రకారం టీకాలు వేయించాల్సిన చిన్నారులు, గర్భిణులు మరియు ఇతర లబ్ధిదారుల తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం అందించి టీకాల కోసం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని, టీకా తీసుకున్న తర్వాత పాటించాల్సిన జాగ్రత్తలు, సాధారణంగా కనిపించే లక్షణాలు, అవసరమైన సూచనలు వంటి ముఖ్యమైన నాలుగు అంశాలను తప్పనిసరిగా లబ్ధిదారులకు వివరించాలని ఆదేశించారు. టీకాల ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి సేవల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా తమ పరిధిలో ఉన్న అర్హత కలిగిన ప్రతి బాలికకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాలికల ఆరోగ్య రక్షణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నివారణ కోసం ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను కూడా డీఎంహెచ్‌వో పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించడం, తాగునీటి సౌకర్యాలు, జాగ్రత్తలపై ప్రచారం వంటి అంశాలను సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పెద్దమ్మగడ్డ వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్టులు, నర్సింగ్ అధికారులు, సబ్ యూనిట్ అధికారి పి. విప్లవ్ కుమార్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హాసన్ పర్తి మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యా సెక్షన్ల మంజూరు

**మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్**

**హాసన్ పర్తి, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



చిన్నారులకు నాణ్యమైన విద్యను ప్రారంభ దశ నుంచే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం హాసన్ పర్తి మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యా (ప్రీ-ప్రైమరీ) సెక్షన్లను ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసింది. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ వెల్లడించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందజేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రాథమిక విద్యకు ముందు దశలో నాణ్యమైన బోధన అందుబాటులోకి రానుంది. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభం కానున్న ఈ సెక్షన్లలో చిన్నారులకు ఆటల ద్వారా అభ్యాసం, సృజనాత్మక కార్యకలాపాలు, ఆనందదాయకమైన బోధనతో కూడిన బాలల అనుకూల వాతావరణాన్ని కల్పించనున్నారు. పూర్వ ప్రాథమిక విద్యా సెక్షన్లు సిద్ధాపూర్, జయగిరి, ఎల్లాపూర్, పెగడపల్లి, ముచ్చర్ల, హసన్పర్తి, అన్నాసాగర్, భీమారం, మునిపల్లి, బైరాన్‌పల్లి, వంగపహాడ్ ప్రభుత్వ పాఠశాలలకు మంజూరయ్యాయి. ప్రతి పాఠశాలలో ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను నియమించడంతో పాటు చిన్నారుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బోధనా విధానాలను అమలు చేయనున్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాలకు రూ.1 లక్ష వరకు గ్రాంట్ మంజూరు చేయనున్నారు. ఈ నిధులతో చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నిచర్, బోధనా-అభ్యాస సామగ్రి సమకూర్చడంతో పాటు ఒక తరగతి గదిని పూర్వ ప్రాథమిక విద్యా అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరానికి మొత్తం 39 ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యా సెక్షన్ల ఏర్పాటుకు అనుమతి లభించగా, అందులో హాసన్ పర్తి మండలానికి చెందిన 11 పాఠశాలలు ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే మండలంలోని రెండు పాఠశాలల్లో ఈ సదుపాయం అమలులో ఉండగా, తాజాగా మరో 11 పాఠశాలలకు అనుమతి లభించడం విద్యారంగ అభివృద్ధికి మరింత బలాన్ని చేకూర్చనుంది. చిన్నారులు ప్రారంభ దశ నుంచే నాణ్యమైన విద్యను పొందేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్యా సెక్షన్లలో చేర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యపై మరింత విశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించనుందని అభిప్రాయపడుతున్నారు.

## పవన్ మాటలు అర్థం లేనివి..

**తెలివి తక్కువగా మాట్లాడటం మంచిది కాదు: బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి**

**పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి**

**తెలంగాణలో కాంగ్రెస్, జనసేన మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందని ఆరోపణ**

**ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ డ్రామా అని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రెస్‌మీట్‌పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. పవన్ మాటలు అర్థం లేనివని, తెలివి తక్కువగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, పవన్ కల్యాణ్ కలిసి ఒక పెద్ద నాటకానికి తెరలేపారని ఆయన ఆరోపించారు. తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభకు రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం వెనుక పెద్ద కుట్ర ఉందని జగదీశ్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ, జనసేన మధ్య ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ ఈ ఘటనతో తెలంగాణ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో నెలకొన్న ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ హైడ్రామా నడుపుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. పవన్ కల్యాణ్, కాంగ్రెస్ పార్టీలు కావాలనే ఈ నాటకాన్ని సృష్టించాయని ఆయన విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

## విధుల్లో నిర్లక్ష్యం..'రియల్ ఎస్టేట్'లో నిమగ్నం..!?

**కళాశాల ఫైళ్ల కంటే ప్లాట్లపైనే మోజు..**

**సీకేఎం కళాశాల సూపరింటెండెంట్ తెరచాటు భాగస్వామ్యాలు..!**




**వరంగల్ / జై భీమ్ న్యూస్ :**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల్లో కొందరు అధికారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. వరంగల్‌లోని చారిత్రక నేపథ్యం ఉన్న సీకేఎం కళాశాల సూపరింటెండెంట్ తీరు ఇప్పుడు విమర్శలకు కేంద్రబిందువుగా మారింది. విధి నిర్వహణను గాలికి వదిలేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో తలమునకలవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**దశాబ్ద కాలంగా పాతుకుపోయిన పెత్తనం..**

సాధారణంగా ఏ ప్రభుత్వ లేదా ఎయిడెడ్ సంస్థలోనైనా ఉద్యోగులకు బదిలీలు సహజం. కానీ, ఈ సూపరింటెండెంట్ విషయంలో మాత్రం ఆ నిబంధనలు వర్తించవన్నట్లుగా ఉంది. అనేక ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోవడంతో, కళాశాల పరిపాలనపై ఆయనకు ఎదురులేకుండా పోయింది. ఈ సుదీర్ఘ కాలం ఆయనకు అధికారులతో, రాజకీయ నాయకులతో బలమైన సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఉపయోగపడిందని, అదే ఆయనకు రక్షణ కవచంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తెరచాటున రియల్ ఎస్టేట్ దందా..**

ఈ సారు ప్రధాన దృష్టి కళాశాల పరిపాలనపై కంటే బయట జరుగుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లపైనే ఎక్కువగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. అధికారికంగా తన పేరు బయటకు రాకుండా, నమ్మకస్తులైన వ్యక్తుల పేర్లతో రియల్ ఎస్టేట్ వెంచర్లలో భారీగా పెట్టుబడులు పెడుతున్నట్లు సమాచారం. కళాశాలకు రావడమే ఆలస్యం, వచ్చాక కూడా తన సీటులో కూర్చుని విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం కంటే, ఫోన్లలో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లు, బ్రోకర్లతో చర్చలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే ప్రచారం ఉంది. కాలేజీ ఫైళ్లు టేబుల్ మీద పేరుకుపోతున్నా, ఈయన గారి దృష్టి మాత్రం వెంచర్ల మ్యాపులపైనే ఉండటం గమనార్హం. మరోవైపు అన్ని వర్గాల వారు చదువుకునే విద్యాసంస్థలో కీలక పదవిలో ఉన్న వ్యక్తి, సామాజిక బాధ్యతను మరిచి ప్రవర్తిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవైపు విధి నిర్వహణలో నిర్లక్ష్యం, మరోవైపు వ్యక్తిగత వ్యాపారాల కోసం అధికార దుర్వినియోగం, ఇలా వరుస ఆరోపణలతో సతమతమవుతున్న ఈ అధికారిపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, తక్షణమే బదిలీ చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సీకేఎం కాలేజీ పైన ప్రత్యేక కథనాలు అతి త్వరలో.......

# కేయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత మజ్జిగ పంపిణీ




**హన్మకొండ, 3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మండుతున్న ఎండలు, అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని ఎస్‌డీఎల్‌సీఈ గేట్ సమీపంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాసంస్థలు విద్యా బోధనతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వేసవి కాలంలో ప్రజలకు చల్లదనాన్ని అందించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. బిక్షాలు మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా కళాశాల తరపున సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎండాకాలంలో శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా తగినంత ద్రవాలు తీసుకోవడం చాలా ముఖ్యమని, మజ్జిగ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, రూసా ఫెలోస్, పరిశోధన విద్యార్థులు, సిబ్బంది సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో మజ్జిగను స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ప్రజల ప్రశంసలు అందుకుంటూ విజయవంతంగా ముగిసింది.

## టీజీ సీపీజీఈటి -2026 దరఖాస్తుల స్వీకరణ కొనసాగింపు

**జూన్ 10 వరకు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తుకు అవకాశం**

**ఇప్పటికే 20,224 మంది అభ్యర్థుల నమోదు**

**హన్మకొండ, 3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో 2026--27 విద్యా సంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీజీ సీపీజిఈటి --2026 ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నట్లు టీజీ సీపీజిఈటి --2026 కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు జూన్ 10వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా నిర్ణీత దరఖాస్తు రుసుము చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే జూన్ 14వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో, జూన్ 18వ తేదీ వరకు రూ.2,000 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు, పరీక్షా విధానం తదితర పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే నబవతీఅవం-స్త్రఎజూస్త్రవ్26ఏస్త్రఘఅశ్రీ.ఎశీఎ ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని, కార్యాలయ సమయాల్లో 0870-2934285 ఫోన్ నంబర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పీజీ కోర్సులకు మొత్తం 20,224 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నట్లు ఆచార్య రాజేందర్ కట్ల వెల్లడించారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు.

## గర్భిణుల వివరాలు, టీకాల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

**ప్రైవేట్ ఆస్పత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు యూవిన్, ౧ హెచ్‌ఎంఐఎస్ పోర్టళ్లపై శిక్షణ**

**డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య ఆదేశాలు**



**హన్మకొండ, 3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా గర్భిణుల నమోదు, ప్రసవ వివరాలు, నవజాత శిశువులకు అందించే వ్యాధి నిరోధక టీకాల సమాచారం తప్పనిసరిగా యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, ఫామ్-ఎఫ్ స్కానింగ్ నివేదికలు తదితర సమాచారాన్ని కూడా సంబంధిత ఆన్‌లైన్ పోర్టళ్లలో సకాలంలో నమోదు చేయాలని సూచించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని బర్త్ డెలివరీ పాయింట్ ప్రైవేట్ ఆస్పత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు యూవిన్, హెచ్‌ఎంఐఎస్ ఆన్‌లైన్ పోర్టళ్లలో నివేదికల నమోదు విధానంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల వివరాలను నమోదు చేయడం వల్ల తదుపరి టీకాలు సకాలంలో అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బి వంటి టీకాల నమోదుతో పాటు వ్యాక్సినేషన్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు ఈ డేటా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణలో ఆన్‌లైన్ డేటా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఆస్పత్రుల్లో నమోదయ్యే ప్రతి వివరాన్ని అదే రోజు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. నివేదికల నమోదులో జాప్యం, నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యూవిన్ కోఆర్డినేటర్ జ్యోత్స్న, వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ శిరీష, జిల్లా డేటా మేనేజర్ ప్రవీణ్ యూవిన్, హెచ్‌ఎంఐఎస్ పోర్టళ్ల వినియోగం, డేటా నమోదు విధానం, నివేదికల సమర్పణ తదితర అంశాలపై సవివరంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, మాతా-శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రుబీనా అఫ్రోజ్, గణాంక అధికారి జి. ప్రసన్నకుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీమతి స్వప్నతో పాటు ఇతర ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో తల్లి-శిశు సంక్షేమ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల అమలును సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది...

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే బలమైన ఐక్యతా భావన ఉందని, దాన్ని చూస్తే తనకు ముచ్చట వేస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి ఉమ్మడి భావన కొరవడిందని, ఇక్కడ ఐక్యతకు బదులుగా ఉప ప్రాంతీయతలు, కులాల ప్రాబల్యం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన పవన్, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న ప్రాంతీయ అస్తిత్వంపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. "తెలంగాణ ప్రజలను చూస్తే ఎందుకు ముచ్చటేస్తుందంటే, వారిలో తెలంగాణ అనే భావన ఉంటుంది. తమిళులకు వారి భాషా, ప్రాంతంపై అభిమానం ఉంటుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో 'ఆంధ్రా' అనే ఉమ్మడి భావన కొరవడింది. ఇక్కడ సబ్-రీజనలిజం, కులతత్వమే ఎక్కువ" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## నాణ్యమైన శిక్షణతోనే సమర్థ పోలీసింగ్..

**తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించిన డీజీపీ సి.వి. ఆనంద్**





**హైద్రాబాద్, 3 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**


తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అధిపతి (డీజీపీ-హెచ్‌ఓపీఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీజీపీ సి.వి. ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. అకాడమీకి చేరుకున్న ఆయనకు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ ఘన స్వాగతం పలికారు. అనంతరం అకాడమీ అధికారులు డీజీపీకి గౌరవ వందనం సమర్పించారు. సందర్శన సందర్భంగా డీజీపీ అకాడమీలోని యూనిట్ హాస్పిటల్, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్లు తదితర శిక్షణా, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అకాడమీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, సంస్థాగత బాధ్యతలు, సంక్షేమ కార్యక్రమాలు, అకాడమీ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ సమగ్ర ప్రజెంటేషన్ అందిస్తూ ప్రాథమిక (ఇండక్షన్), సేవాకాల (ఇన్-సర్వీస్) శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమ చర్యల వివరాలను డీజీపీకి వివరించారు. సమీక్ష అనంతరం మాట్లాడిన డీజీపీ సి.వి. ఆనంద్, దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ ఒకటిగా గుర్తింపు పొందిందని ప్రశంసించారు. నాణ్యమైన పోలీసు శిక్షణ అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో జట్టుగా పనిచేయాలని సూచించారు. తాను గతంలో జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (ఎన్‌ఐఎస్‌ఏ)లో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, వృత్తిపరమైన పోలీసింగ్‌కు శిక్షణే బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు (పీటీసీలు), జిల్లా శిక్షణా కేంద్రాలు (డీటీసీలు) సహా అన్ని శిక్షణా సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఇతర సంస్థాగత అవసరాల విషయంలో ప్రధాన కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అన్ని హోదాల్లోని పోలీసు సిబ్బందికి తప్పనిసరి శిక్షణా కోర్సులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించిన డీజీపీ, మాదకద్రవ్యాల నియంత్రణ (ఎన్‌డీపీఎస్), సైబర్ నేరాల దర్యాప్తు, మోటార్ వాహనాల చట్టం అమలు, రోడ్డు భద్రత, ప్రజల్లో అవగాహన కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే తెలంగాణ పోలీసు అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమం, సమాన అవకాశాలు, సంస్థాగత సంస్కరణల బలోపేతానికి "తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్" కార్యక్రమాన్ని కూడా ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన సీనియర్ అధికారులు, శిక్షణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాకు సమయపాలన ఉండదు..!

**ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయాలకు చేరుకోని రెవెన్యూ సిబ్బంది**

**ఖాళీగా దర్శనమిచ్చిన రెవెన్యూ కార్యాలయాలు - ప్రజలు ఎదురుచూపులు**




**హన్మకొండ జిల్లా, జూన్ 3, 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని పలు రెవెన్యూ కార్యాలయాల్లో సమయపాలన లోపాలు బహిర్గతమయ్యాయి. ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు, సిబ్బంది కార్యాలయ సమయం దాటినా విధులకు హాజరుకాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు సాధారణంగా ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, బుధవారం ఉదయం 11 గంటలు దాటినా పలు రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయ గదుల్లో కంప్యూటర్లు, ఫైళ్లు, ఖాళీ కుర్చీలు మాత్రమే దర్శనమివ్వగా, విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, భూ సమస్యలు, ధరణి దరఖాస్తులు తదితర రెవెన్యూ సేవల కోసం ఉదయం నుంచే కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వృద్ధులు, మహిళలు అధికారుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలు సమయానికి కార్యాలయాలకు రావాలని సూచించే అధికారులు, ఉద్యోగులే సమయపాలన పాటించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజలకు ఒక నిబంధన... అధికారులకు మరో నిబంధనా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. ఒక రోజు కూలి పనిని వదిలి కార్యాలయాలకు వచ్చినా అధికారులు అందుబాటులో లేకపోవడంతో పనులు పూర్తికాక మళ్లీ రావాల్సి వస్తోందని పలువురు వాపోయారు. ప్రభుత్వం పారదర్శక పాలన, సమర్థవంతమైన సేవల కోసం బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది ఎంతవరకు సమర్థంగా అమలవుతోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయ సమయాలను పాటించని సిబ్బందిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయాలు ఖాళీగా కనిపించడం, అధికారులు ఆలస్యంగా విధులకు హాజరుకావడం ప్రభుత్వ సేవలపై ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ప్రజాసేవలో సమయపాలన అత్యంత కీలకమైన అంశమని, ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టాలంటే అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించి సమయపాలన పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుంచి

**హన్మకొండ జిల్లాలో 197 మంది విద్యార్థులు హాజరు కానున్న పరీక్షలు**

**జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్**



**హన్మకొండ, జూన్ 3, 2026 (జై భీమ్ న్యూస్)**

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తెలిపారు. హన్మకొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి మొత్తం 197 మంది విద్యార్థులు ఈ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం హన్మకొండ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మార్కాజీని ప్రత్యేక పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. పదో తరగతి వార్షిక పరీక్షల మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు సహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి తీసుకురావడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశం కల్పించబోమని హెచ్చరించారు. అందువల్ల విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు తమ పాఠశాలల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు తప్పనిసరిగా సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తెలిపారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసు.. అనేక చోట్ల ఈడీ దాడులు

**టీటీడీ కల్తీ నెయ్యి కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం**

**దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాల్లో 15 చోట్ల ఏకకాలంలో సోదాలు**

**తనిఖీల్లో రూ. 60 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు**

**ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌పై మనీలాండరింగ్ కేసు నమోదు**

**హవాలా, అక్రమాస్తులపై దృష్టి సారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్**



**తిరుపతి, జై భీమ్ న్యూస్**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో కలకలం రేపిన కల్తీ నెయ్యి కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై బుధవారం దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో రూ.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మహారాష్ట్ర (అహిల్యనగర్, ముంబై), రాజస్థాన్ (బికనీర్), ఉత్తరాఖండ్ (డెహ్రాడూన్, రూర్కీ), తమిళనాడు (దిండిగల్), ఆంధ్రప్రదేశ్ (గుంటూరు), ఢిల్లీలలో ఈడీ బృందాలు సోదాలు జరిపాయి. ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ మరికొందరిపై నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. నిందితులు కొందరు టీటీడీ అధికారులతో కుమ్మక్కై, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి నాణ్యత లేని, కల్తీ నెయ్యి సరఫరా చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల టీటీడీకి తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు గుర్తించారు. గతంలో ఈ కేసుపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపింది. టెండర్లు, సరఫరాలలో అవకతవకలు జరిగినట్లు అప్పట్లో తేలింది. ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగి హవాలా లావాదేవీలు, అక్రమ మార్గాల్లో సంపాదించిన డబ్బుతో స్థిరాస్తులు కొనుగోలు చేయడం వంటి అంశాలపై దృష్టి సారించింది. కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు తెలిపారు.


# గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలి

**హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతానికి అన్ని శాఖల సమన్వయం అవసరం**

**హన్మకొండ,3 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 4, 6, 8, 10, 12 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటేలా చైతన్యం తీసుకురావాలని, రహదారుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, మురుగు కాల్వలను శుభ్రపరిచి ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపైకి చేరకుండా కమ్యూనిటీ, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, డ్రైనేజీల నిర్వహణ, పారిశుద్ధ్య చర్యలను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. పంటల అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని పోషకాలు నశిస్తాయని, వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు. గ్రామ, వార్డు సభల్లో మహిళల రక్షణ, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రహదారి భద్రత అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూన్ 10న జరిగే ప్రతి గ్రామ సభలో అరైవ్ అలైవ్ కార్యక్రమాలను నిర్వహించి రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట భద్రతా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ 12న నిర్వహించనున్న డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాల్లో యువత, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ అధికారులు మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ, వార్డు సభల్లో పాల్గొని ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, పిడుగులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే పరిస్థితుల్లో ప్రజల తరలింపు, ముందస్తు జాగ్రత్తలపై ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని తెలిపారు. వనమహోత్సవ కార్యక్రమాలకు అవసరమైన మొక్కలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందించే రాష్ట్ర, కేంద్ర విపత్తు నిర్వహణ మరియు రెస్క్యూ బృందాలను సన్నద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రవి, డీపీవో లక్ష్మీ రమాకాంత్, సీపీవో, విద్యుత్, విద్యాశాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



# కబ్జాలపై సీపీ ఉక్కుపాదం






**కబ్జాల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదు..!**

**పాత, కొత్త భూ కబ్జాదారులపై సీపీ నజర్**

**కోట్ల విలువైన భూములు కబ్జా చేసిన వారిపై ఉక్కుపాదం**

**అసలైన భూ యజమానులు ఎవరు..? కబ్జాదారులు ఎవరు..? లోతైన విచారణకు పోలీసుల సిద్ధం**

**సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత పర్యవేక్షణలో కఠిన చర్యలకు రంగం సిద్ధం**

**వరంగల్/కేయూ, 3 జూన్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూ కబ్జాలు, భూతగాదాల సెటిల్‌మెంట్లు, రౌడీ షీటర్ల అక్రమ కార్యకలాపాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. భూ కబ్జాలకు పాల్పడే వారెవరైనా సరే ఉపేక్షించబోమని స్పష్టం చేస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పాత, కొత్త భూ కబ్జాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని విశ్వసనీయ సమాచారం. భూ కబ్జాల ద్వారా కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కూడబెట్టిన వ్యక్తుల వివరాలను సేకరిస్తూ, అసలైన భూ యజమానులు ఎవరు..? అక్రమంగా భూములను ఆక్రమించిన వారు ఎవరు..? అనే అంశాలపై లోతైన విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత పర్యవేక్షణలో భూ కబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. భూ ఆక్రమణలు, నకిలీ పత్రాలు, అక్రమ సెటిల్‌మెంట్లకు సంబంధించిన వ్యవహారాలపై సమగ్ర సమాచారం సేకరిస్తూ బాధితులకు న్యాయం చేసే దిశగా పోలీసు యంత్రాంగం అడుగులు వేస్తోంది. బుధవారం కేయూ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఏసీపీ నర్సింహరావు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, కేసు ప్రాపర్టీ గదులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. స్టేషన్ రికార్డులు, రౌడీ షీటర్లు, అనుమానితుల వివరాలను సమీక్షించిన సీపీ, యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్ల కార్యకలాపాలపై ఆరా తీశారు. భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడే రౌడీ షీటర్లు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులను గుర్తించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల పట్ల ఎలాంటి సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, వారి కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. భూ కబ్జాలు, నకిలీ పత్రాల ద్వారా భూముల ఆక్రమణ, అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లను సందర్శిస్తున్న ఉన్నతాధికారులు భూ కబ్జాల వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఫిర్యాదులపై విచారణ చేపడుతున్నారు. దీంతో బాధితుల్లో నమ్మకం పెరుగుతుండగా, ప్రజలు పోలీసు శాఖ చర్యలను స్వాగతిస్తున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత విస్తరించాలని, విద్యాసంస్థల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ సూచించారు. స్టేషన్ పరిధిలోని ఎస్ఐలు తమకు కేటాయించిన సెక్టార్లలో నేరాల నియంత్రణతో పాటు ముందస్తు సమాచార సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూ కబ్జాదారులు, అక్రమ సెటిల్‌మెంట్ దారులు, రౌడీ షీటర్లపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతుండటంతో బాధితుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ దార కవిత, ఏసీపీ నర్సింహరావు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమార్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ చారిత్రక నీలోఫర్ కేఫ్... త్వరలో కొత్త బ్రాంచ్... ఎక్కడంటే...!

**హైదరాబాదీ చాయ్ ఐకాన్.. కొంపల్లికి కేఫ్ నిలోఫర్**

**హైదరాబాద్‌లో విస్తరిస్తున్న ప్రఖ్యాత కేఫ్ నిలోఫర్**

**కొంపల్లిలో 36,000 చదరపు అడుగుల భారీ ఔట్‌లెట్ ఏర్పాటు**

**హైటెక్ సిటీ తరహాలో ప్రీమియం లాంజ్‌గా నిర్మాణం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ నగరవాసుల టీ సంస్కృతిలో దశాబ్దాలుగా భాగమైపోయిన ప్రఖ్యాత 'కేఫ్ నిలోఫర్' ఇప్పుడు తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. నగరంలోని కొంపల్లిలో అత్యంత భారీ, కొత్త ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇరానీ చాయ్, బన్ మస్కా వంటి తమ ప్రత్యేక రుచులను ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకు సిద్ధమైంది. కొంపల్లిలోని 'ఫెయిర్‌మౌంట్ డౌన్‌టౌన్' కమర్షియల్ కాంప్లెక్స్‌లో సుమారు 36,000 చదరపు అడుగుల విశాలమైన స్థలాన్ని కేఫ్ నిలోఫర్‌కు లీజుకు ఇచ్చినట్లు ఫెయిర్‌మౌంట్ బిల్డర్స్ ప్రకటించింది. ఇప్పటికే హైటెక్ సిటీలో ఉన్న ఫ్లాగ్‌షిప్ బ్రాంచ్ తరహాలోనే ఈ కొత్త ఔట్‌లెట్‌ను కూడా మల్టీ-లెవల్ ప్రీమియం లాంజ్‌గా తీర్చిదిద్దనున్నారని సమాచారం. దీని ద్వారా సంప్రదాయ టీ అనుభవాన్ని ఒక విలాసవంతమైన జీవనశైలికి అనుగుణంగా మార్చనున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఒక చిన్న కేఫ్‌గా ప్రారంభమైన నిలోఫర్, నేడు హైదరాబాద్ సాంస్కృతిక చిహ్నంగా మారింది. 2025లో హైటెక్ సిటీలో దాదాపు 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద టీ కేఫ్‌ను ప్రారంభించి నిలోఫర్ వార్తల్లో నిలిచింది. ఈ విస్తరణతో సెంట్రల్, వెస్ట్రన్ హైదరాబాద్‌లకు మాత్రమే పరిమితమైన నిలోఫర్, ఇప్పుడు నగరంలోని ఇతర ప్రాంతాలకూ చేరువవుతోంది. అయితే, ఈ విస్తరణపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొంపల్లి, దాని పరిసర ప్రాంతాల ప్రజలు కొత్త ఔట్‌లెట్ రాకపై సంతోషం వ్యక్తం చేస్తుండగా, పాత కస్టమర్లు మాత్రం పెరుగుతున్న ధరలపై సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఔట్‌లెట్లలో మౌలిక సదుపాయాలు, సేవలకు అనుగుణంగా ధరలు పెంచినప్పటికీ, పాత రుచుల స్ఫూర్తిని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని యాజమాన్యం చెబుతోంది.

# రష్యా పర్యటనలో లోకేష్..
## మాస్కో ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ పై ప్రత్యేక ఆసక్తి

**రష్యా పర్యటనలో మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్‌ను సందర్శించిన లోకేష్**
**మాస్కో రవాణా వ్యవస్థ పనితీరు అద్భుతమంటూ ప్రశంసలు**
**భారత్‌లో కూడా ఇటువంటి వ్యవస్థలు రావాలని ఆకాంక్ష**
**ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో ట్రాఫిక్, భద్రత పర్యవేక్షణపై ప్రత్యేక ఆసక్తి**
**లోకేష్ బృందానికి అక్కడి రవాణా శాఖ ఉన్నతాధికారుల ఘనస్వాగతం**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**


మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజా రవాణా వ్యవస్థల్లో ఇదొకటని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. భారత్‌లో కూడా ఇటువంటి సమగ్ర, సాంకేతిక రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తన రష్యా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆయన మాస్కోలోని ఈ అత్యాధునిక రవాణా అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ బృందానికి మాస్కో రవాణా శాఖ ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అటానమస్ ట్రాన్స్‌పోర్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ విభాగాధిపతి పావెల్ బోక్షా, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ హెడ్ ఓల్గా పిచికోవా, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ అలెగ్జాండర్ సువోరోవ్, ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ డైరక్టర్ జనరల్ సలహాదారు మస్తిస్లావ్ ఇసాకోవ్ వంటి కీలక అధికారులు లోకేష్ బృందాన్ని స్వాగతించి, సెంటర్ కార్యకలాపాలను వివరించారు. అనంతరం, మాస్కో అటానమస్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్ అభివృద్ధి, దాని ప్రత్యేకతల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా మాస్కో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్ పనితీరు, కార్యకలాపాల గురించి లోకేష్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా అక్కడి అధునాతన టికెటింగ్ సిస్టమ్స్, డెవలప్‌మెంట్ లేబరేటరీని ఆయన బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, మాస్కో రవాణా వ్యవస్థలోని ప్రత్యేకతలను ప్రస్తావించారు. "ఇక్కడ మెట్రో, బస్సులు, ట్రాలీలు, ఎలక్ట్రిక్ రైళ్లతో పాటు బైక్-షేరింగ్, స్కూటర్ల వరకు అన్నీ ఒకే పర్యావరణ వ్యవస్థ కిందకు తీసుకురావడం అభినందనీయం. ప్రయాణికులు ఒకే మొబైల్ అప్లికేషన్ ద్వారా వాటన్నింటినీ సులభంగా ఉపయోగించుకునే సౌకర్యం కల్పించడం గొప్ప విషయం" అని అన్నారు. సబర్బన్ ప్రాంతాలను ప్రధాన నగరంతో



అనుసంధానిస్తూ, మెట్రోపై రద్దీని తగ్గించేందుకు దోహదపడుతున్న 'మాస్కో సెంట్రల్ డయామీటర్స్ (ఎంసీడీ)' ప్రాజెక్టు ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. "మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్, ట్రాన్స్‌పోర్ట్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ సెంటర్లు కృత్రిమ మేధస్సు (ఏఐ), సీసీ కెమెరాల ద్వారా నగరం మొత్తం ట్రాఫిక్, భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఈ సాంకేతికత ఎంతగానో సహాయపడుతుంది. ఇలాంటి వ్యవస్థలు మన దేశంలో కూడా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది" అని లోకేష్ స్పష్టం చేశారు. ఈ పర్యటన ద్వారా తెలుసుకున్న అంశాలను భవిష్యత్తులో మన రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

# తెలంగాణ రాజకీయాలపై ఏపీలో పవన్ కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ ఎవరి జాగీరు కాదన్న పవన్ కల్యాణ్**
**అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు**
**తెలంగాణ బిడ్డలు పోటీ చేస్తే అభ్యంతరం ఎందుకని ప్రశ్న**
**గత వైసీపీ పాలనలో కుల రాజకీయాలు పెరిగాయని విమర్శ**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ఎవరి జాగీరు కాదని, అక్కడి రాజకీయాల్లో జనసేన భాగస్వామ్యంపై వస్తున్న విమర్శలకు అర్థం లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం అమరావతి పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పోటీ చేసే హక్కు అక్కడి భూమిపుత్రులకే ఉంటుందని అనడం సరికాదని, ఇతరులు పోటీ చేయకూడదని అభ్యంతరాలు చెప్పడం తగదని అన్నారు. అంతకుముందు, అమరావతిలోని 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి పవన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయులను కులాలకు పరిమితం చేసే ధోరణిని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు విపరీతంగా పెరిగాయని, వాటిని ఎదుర్కొనేందుకే "సేనా గళం" కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ తరఫున అక్కడి స్థానికులే పోటీ చేస్తారని, ఆంధ్రప్రదేశ్ నేతలు ఎవరూ అక్కడికి వెళ్లి పోటీ చేయబోరని స్పష్టత ఇచ్చారు. "తెలంగాణ బిడ్డలు పోటీ చేస్తే అభ్యంతరం ఎందుకు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. గద్దర్ కుటుంబం పట్ల, కేటీఆర్ పట్ల తనకు గౌరవం ఉందని, అయితే దేశ సమగ్రతకు భంగం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తానని అన్నారు. కేటీఆర్ తనకు సోదరుడితో సమానమని అన్నారు.

# కోటి మందితో యోగాంధ్ర-2026 సీఎం చంద్రబాబు ప్రకటన

**జూన్ 21న కోటి మందితో ౧ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం**

**'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం**


**పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు**

**యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం**

**జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఎశీస్త్రుఉఅనష్త్రతీఖ.ఖజూ.స్త్రశీజ.ఱఅ పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.



# సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారేమో కానీ...!:

**కులాలపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు..**
**సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారు కానీ**
**ఆయా కులాల ప్రజలు నష్టపోయారన్న పవన్**
**గత వైసీపీ పాలనలో కుల దూషణలు, రాజకీయాలు పరాకాష్ఠకు చేరాయని విమర్శలు**
**డాక్టర్ సుధాకర్, దళిత యువకుడి హత్య వంటి ఘటనలను ప్రస్తావించిన జనసేనాని**
**కులాల ఐక్యతే తమ సిద్ధాంతమని, దీనికి చరమగీతం పాడతామని స్పష్టీకరణ**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో కుల సంఘాలు ఏర్పాటు చేసుకుని వాటి నాయకులు బాగుపడ్డారేమో కానీ, ఆయా కులాల ప్రజలు మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా తీవ్రంగా నష్టపోతున్నారని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కులాల పేరుతో జరుగుతున్న రాజకీయాలకు చరమగీతం పాడాలని, కులాల ఐక్యతే తమ పార్టీ మూల సిద్ధాంతమని స్పష్టం చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పవన్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు వంటి మహనీయుడిని సైతం ఒక కులానికే పరిమితం చేసే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు, కుల దూషణలు పరాకాష్ఠకు చేరాయని పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 1998 నుంచి మొదలైన ఈ ధోరణి, వైసీపీ పాలనలో జర్నలిస్టులను సైతం కులం పేరుతో దూషించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఒక ఎమ్మెల్సీ, దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేస్తే, అధికార పార్టీ నేతలు హంతకుడిని వెనకేసుకొచ్చారని, అప్పుడు దళిత సంఘాలు సైతం మాట్లాడలేని పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. అలాగే కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి, ఆయన మరణానికి కారణమైనా ఏ సంఘాలు నోరు మెదపలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కుల సంఘాలు మౌనంగా ఉండిపోవడం వల్లే నాయకులు బాగుపడుతున్నారని, ప్రజలు మాత్రం నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. కుల నిర్మూలన అనే అంబేద్కర్ ఆశయం సాధ్యమో కాదో తెలియదు కానీ, కులాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం నేటి సమాజానికి అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ సమస్యతో బాధపడుతుంటే, వాటిని పక్కనపెట్టి కేవలం కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ కుల రాజకీయాలకు ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని తమ పార్టీ నిర్ణయించుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన తరఫున గెలిచిన 54 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు వేర్వేరు కులాలకు చెందినవారేనని, అందరి సహకారంతోనే గెలుపు సాధ్యమైందని గుర్తు చేశారు. ఇకపై ఆంధ్రప్రదేశ్‌లో కులాల ఐక్యతను ప్రోత్సహిస్తూ, అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు శ్రీకారం చుడతామని జనసేన నాయకత్వం సమిష్టిగా నిర్ణయం తీసుకున్నట్లు పవన్ ఈ సందర్భంగా ప్రకటించింది.




# ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే...

**మీరే ఉగ్రవాదులు: పవన్ కల్యాణ్ పై నిరంజన్ రెడ్డి ఫైర్**
**ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం అన్న నిరంజన్ రెడ్డి**
**తెలంగాణ ప్రజలు జాతీయవాదులు అని వ్యాఖ్య**
**పక్క రాష్ట్ర నేతలు తెలంగాణను వెక్కిరిస్తుంటే రేవంత్ ఎందుకు మనంగా ఉన్నారని ప్రశ్న**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం. ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే, మొదట మీరే ఉగ్రవాదులు అవుతారు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాటి రాచరికపు పాలన అంతమై, తెలంగాణ భారతదేశంలో విలీనం కావాలని ప్రాణాలర్పించి పోరాటం చేసిన జాతీయవాదులు తమ తెలంగాణ ప్రజలని నిరంజన్ రెడ్డి అన్నారు. నాటి కాలంలో తమను బలవంతంగా ఆంధ్ర ప్రాంతంతో విలీనం చేశారని.. ఆ తర్వాత జరిగిన అన్యాయాలు, దుర్మార్గాల నుంచి విడిపోవాలనే ఇక్కడి ప్రజలు పోరాడారు తప్ప, తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కారని ఆయన తేల్చి చెప్పారు. పక్క రాష్ట్రాల నాయకులు వచ్చి మన గడ్డపై నిలబడి తెలంగాణ సమాజాన్ని వెక్కిరిస్తుంటే.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు పెద్ద ద్రోహి అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించిన తీరును అభినందించిన ఆయన.. మిగతా మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. "తెలంగాణ మంత్రుల నోళ్లకు ఏమైనా పక్షవాతం వచ్చిందా?" అని ఘాటుగా ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య ఎన్ని రాజకీయ విభేదాలైనా ఉండొచ్చని.. కానీ, పొరుగు రాష్ట్రాల నేతలు వచ్చి తెలంగాణను అవమానిస్తుంటే అందరూ ఏకతాటిపైకి వచ్చి ఖండించకపోవడం దారుణమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేసిన ఆయన.. ప్రభుత్వ వైఫల్యాలను, తెలంగాణకు జరుగుతున్న అవమానాలను సోషల్ మీడియా వేదికగా గట్టిగా ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

# మీ కమ్యూనిజం ఏమైంది?: పవన్‌కు కూనంనేని సూటి ప్రశ్న

**పవన్ వ్యాఖ్యలపై సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు విమర్శలు**
**జనసేన కనుమరుగైనా కమ్యూనిజం నిలిచి ఉంటుందని వ్యాఖ్య**
**పవన్ కల్యాణ్ అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కల్యాణ్ నిన్న చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తన తండ్రి, తాను కమ్యూనిస్టులమని పవన్ కల్యాణ్ పదేపదే చెబుతారని, మరి మీలోని ఆ కమ్యూనిజం ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. సనాతన ధర్మం, కమ్యూనిజం, రాష్ట్ర విభజన వంటి అంశాలపై పవన్‌ను ఆయన నిలదీశారు. జనసేన పార్టీ కనుమరుగైనా, కమ్యూనిజం నిలిచి ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లోకి దూకుడుగా ప్రవేశించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆయన అపరిచితుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ కార్మికులారా విడిపోండని కమ్యూనిస్టులు చెప్పారా అని ప్రశ్నించారు. ఈ విషయంలోకి కమ్యూనిస్టులను ఎందుకు లాగారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవాన్ని రాజకీయం చేస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసమే ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి సవాల్ విసరడమంటే ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడమే అన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# మూడో పెళ్లికి సిద్ధమైన ఆమిర్ ఖాన్.. పెళ్లికూతురు ఈవిడే!

**తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌ను వివాహం చేసుకోనున్న ఆమిర్ ఖాన్**
**జూలై 5న నిరాడంబరంగా రిజిస్టర్ మ్యారేజ్**
**గత సంవత్సరం పుట్టినరోజున గౌరీని మీడియాకు పరిచయం చేసిన ఆమిర్**



బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ తన వ్యక్తిగత జీవితంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. ఆయన తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌ను మూడో వివాహం చేసుకోనున్నారు. ఆమిర్ సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఏడాది జూలై 5న వీరిద్దరూ ఒక్కటవనున్నారు. కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలని ఈ జంట నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ పెళ్లికి సంబంధించి సినిమా పరిశ్రమ వారి కోసం ఎలాంటి గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయడం లేదని కూడా తెలుస్తోంది. అయితే, ఈ పెళ్లి వార్తలపై ఆమిర్ ఖాన్ గానీ, ఆయన ప్రతినిధులు గానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. గత సంవత్సరం మార్చిలో తన 60వ పుట్టినరోజు సందర్భంగా ఆమిర్ ఖాన్ తన ప్రేయసి గౌరీని మీడియాకు పరిచయం చేసిన విషయం తెలిసిందే. దాదాపు 25 ఏళ్లుగా తాము స్నేహితులమని, కొన్నాళ్ల క్రితమే తమ మధ్య ప్రేమ చిగురించిందని ఆమిర్ ఆ సమయంలో వెల్లడించారు. అప్పటి నుంచి వీరిద్దరూ పలు సందర్భాల్లో కలిసి కనిపిస్తున్నారు. గౌరీకి ఇప్పటికే ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమిర్ ఖాన్‌కు గతంలో రెండుసార్లు వివాహమైంది. మొదట రీనా దత్తాను పెళ్లి చేసుకోగా, వారికి జునైద్, ఇరా ఖాన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2002లో వారు విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2005లో కిరణ్ రావును రెండో వివాహం చేసుకున్నారు. వీరికి ఆజాద్ రావు ఖాన్ అనే కుమారుడు ఉన్నాడు. అమీర్, కిరణ్ 2021లో విడిపోయారు.

# 20 రోజులు గాయాలతోనే షూటింగ్.. 'పెద్ది' కోసం చరణ్ డెడికేషన్ పీక్స్

**పెద్ది' సినిమా కోసం రెజ్లర్‌గా మారిన రామ్ చరణ్**
**దంగల్ కోచ్‌తో 3-4 నెలల పాటు ప్రత్యేక శిక్షణ**
**గాయాలైనా 20 రోజుల పాటు కుస్తీ సన్నివేశాల చిత్రీకరణ పూర్తి**
**తెలంగాణకు చెందిన నిజమైన రెజ్లర్లతో సహజత్వం కోసం ప్రయత్నం**
**జూన్ 4న సినిమా ప్రేక్షకుల ముందుకు**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం కోసం అపూర్వమైన అంకితభావం ప్రదర్శించారని దర్శకుడు బుచ్చిబాబు సానా వెల్లడించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా రేపు (జూన్ 4) ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇందులో రామ్ చరణ్ ఒక రెజ్లర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రలో సహజంగా కనిపించడం కోసం చరణ్ చేసిన కఠోర శ్రమ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాలోని కుస్తీ సన్నివేశాలు వాస్తవికంగా ఉండాలనే ఉద్దేశంతో చిత్ర బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని బుచ్చిబాబు వెల్లడించారు. దీనికోసం రామ్ చరణ్ దాదాపు 3-4 నెలల పాటు కఠినమైన కుస్తీ శిక్షణ తీసుకున్నారని తెలిపారు. విశేషమేమిటంటే, ఆమిర్ ఖాన్ 'దంగల్' చిత్రానికి పనిచేసిన కోచ్‌నే ఈ సినిమా కోసం కూడా నియమించుకున్నట్టు వెల్లడించారు. అంతేకాకుండా, తెలంగాణకు చెందిన నిజమైన రెజ్లర్లను కూడా ఈ షూటింగ్‌లో భాగం చేసి, వారితో పాటు ఇతర నటీనటులకు కూడా శిక్షణ ఇప్పించామని వివరించారు. ఈ క్రమంలో రామ్ చరణ్ తీవ్రంగా గాయపడినట్లు వెల్లడించారు. కుస్తీ సన్నివేశాల చిత్రీకరణకు కొద్ది రోజుల ముందు ఒక కండరం గాయానికి గురికాగా, ఆ గాయం ఏకంగా ఏడు చోట్లకు వ్యాపించిందని తెలిపారు. అయినప్పటికీ, నొప్పిని భరిస్తూనే, ఎలాంటి మెడికల్ స్కానింగ్ చేయించుకోకుండా 20 రోజుల పాటు సాగిన సుదీర్ఘ షెడ్యూల్‌ను పూర్తి చేయడం రామ్ చరణ్ డెడికేషన్‌కు నిదర్శనం అని బుచ్చిబాబు సానా కొనియాడారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బోమన్ ఇరానీ, శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.





# ఎవరీ శిల్పా షిండే...

ప్రముఖ టెలివిజన్ నటి శిల్పా షిండే చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దాదాపు పదేళ్ల క్రితం ఒక నిర్మాతపై తాను అబద్ధపు లైంగిక వేధింపుల కేసును పెట్టానని ఆమె స్వయంగా ఒప్పుకోవడంతో వివాదం మొదలైంది. ఈ నేపథ్యంలో తప్పుడు కేసు నమోదు చేసినందుకు ఆమెను తక్షణమే అరెస్ట్ చేయాలని పురుషుల హక్కుల ఎన్జీవో డిమాండ్ చేస్తోంది. వివరాల్లోకి వెళితే, 'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్‌తో ప్రసిద్ధి చెందిన శిల్పా షిండే, ఇటీవల కమెడియన్ భారతీ సింగ్, హర్ష్ లింబాచియా హోస్ట్ చేసిన ఒక పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2017లో నిర్మాత సంజయ్ కోహ్లీపై తాను తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టానని అంగీకరించారు. "కాంట్రాక్ట్ వివాదాలు, చెల్లింపులలో జాప్యం కారణంగా నాకు వేరే మార్గం కనిపించలేదు. అందుకే ఆ కేసు పెట్టాను. అది అబద్ధం అని మొదటిసారి ఒప్పుకుంటున్నాను" అని ఆమె తెలిపారు. రావాల్సిన డబ్బులు అందాక కోర్టు బయటే కేసును పరిష్కరించుకున్నామని వివరించారు. శిల్పా షిండే ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే, ఢిల్లీకి చెందిన 'ఎన్సీఎంఇండియా కౌన్సిల్ ఫర్ మెన్ అఫైర్స్' అనే పురుషుల హక్కుల సంస్థ స్పందించింది. "డియర్ ముంబై పోలీస్, నిర్మాతపై తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టినందుకు శిల్పా షిండేను దయచేసి అరెస్ట్ చేయండి అని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. నిజమైన బాధితులను రక్షించే చట్టాలను ఇలా దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాలని వారు కోరుతున్నారు. ఈ వ్యాఖ్యలపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆమెను విమర్శిస్తుండగా, నటి బెబికా ధుర్వే వంటి వారు నిజం చెప్పినందుకు ధైర్యవంతురాలని ప్రశంసించారు. ప్రస్తుతం శిల్పా, నిర్మాత కోహ్లీ కుటుంబంతో సత్సంబంధాలనే కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.